క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారిని శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అన్నదానానికి రూ.11,116 విరాళం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం మండలం, నరసాయపాలెం గ్రామానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లు, మల్లిక దంపతులు రూ.11,116, ఆలయ ఇన్‌స్పెక్టర్ జంగం ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

రైతుకూలీ నేత శివయ్యకు నివాళి



నందిగామ: మండల పరిధిలోని కమ్మవారిపాలెం గ్రామంలో కామ్రేడ్ చంద్ర శ్రీమన్నారాయణ (శివయ్య)15వ వర్ధంతిని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అమర స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. శివయ్య చిత్ర పటానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన నిరుపేదలు, రైతుల పక్షాన శివయ్య చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు ఎం.రాంబాబు, కోట్యా నాయక్ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జగ్గయ్యపేట లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ జగ్గయ్యపేట కోర్టు పరిధిలో కేసులు కలిగిన కక్షిదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రాజీ అనే రాజ మార్గంలో తమ కేసులు పరిష్కరించుకోవాల్సిందిగా ఆమె కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నటరత్న ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవాసంస్థఆధ్వర్యాన పలు రంగాలలో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న పురస్కారాలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ స్థాపకఅధ్యక్షులు డాక్టర్ కేఎస్ఎస్ నారాయణ మాష్టార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 20లోపు దరఖాస్తులు పంపాలని ఇతర వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): మూడు స్కూటీలను లారీ ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయాలపాలయ్యారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలుకాగా మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తుమ్మలపాలెం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ప్రమాదం జరిగింది. ఇబ్రహీంపట్నం వైపు నుంచి గుంటుపల్లి వైపు మూడు స్కూటీలపై ఐదుగురు వెళుతున్న సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి మూడు స్కూటీలను వరుసగా ఢీకొట్టింది. మూలపాడు గ్రామానికి చెందిన నళిని, గుంటుపల్లికి చెందిన కృష్ణవేణి, జానేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కంప్యూటర్ టెక్నాలజీపై అవగాహన ఉండాలి

మైలవరం: కంప్యూటర్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన, ఆసక్తి కల్పించేందుకు వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభించారు. కళాశాల ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. కంప్యూటర్స్ ల్యాబ్స్, డిజిటల్ క్లాస్ రూమ్‌లో నిపుణులైన అధ్యాపకులతో కంప్యూటర్స్ మౌలిక సూత్రాలు ల్యాప్‌టాప్స్‌పై 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పేదలకు ఇంగ్లిష్ మీడియం చదువులే లక్ష్యం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన



అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెద్దాపురం(వీరులపాడు): ప్రతి నిరుపేద విద్యార్థి ఇంగ్లిష్ మీడియం చదవాలనే సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో చేపడుతున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అదనపు తరగతి గదుల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించటంతో పాటు పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని కోరారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన..

గ్రామంలో రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టే శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అన్ని గ్రామాలలోని శ్మశానవాటికలను ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి చేస్తామన్నారు. శ్మశానవాటికలు లేని గ్రామాల్లో శ్మశానవాటికలకు స్థలం కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

బాప్‌గార్డు మిషన్ అందజేత

కంచికచర్ల: రోడ్ల వెంబడి చెత్తా చెదారాన్ని తొలగించేందుకు బాప్‌గార్డ్ మిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కీసర స్వర్ణటోల్‌ప్లాజా నిర్వాహకులు అందజేసిన బాప్‌గార్డ్ మిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈమేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా గ్రామాల సర్పంచులు బాప్‌గార్డ్ మిషన్‌ను తీసుకెళ్లి శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. రూ.17.4 లక్షల విలువగల బాప్‌గార్డ్ మిషన్‌ను స్వర్ణటోల్‌ప్లాజా యాజమాన్యం ప్రజా సంక్షేమం కోసం అందించటం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం సర్పంచి వేల్పుల సునీత పుట్టినరోజు సందర్భంగా ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, వైస్ ఎంపీపీ బండి మల్లిఖార్జునరావు, నాయకులు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, పత్తిపాటి కృష్ణమూర్తి, కాలవ పెదబాబు, బుడ్డి సత్యనారాయణ, మంగిశెట్టి పుల్లారావు,సర్పంచి వేల్పుల సునీత, తహసీల్దార్ శంకరబాబు, ఎంపీడీఓ కే బాలశంకరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కే రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి



కథలు చదువుతున్న విద్యార్థులు



పేట గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు



వత్సవాయి గ్రంథాలయంలో కుర్చీలాటలో విద్యార్థులు

పెనుగంచిప్రోలు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు శాఖా గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణలో భాగంగా శుక్రవారం గ్రంథలయాల్లో విద్యార్థులకు నీతి వాక్యాలు, కథలు చెప్పించటంతో పాటు గ్రంథ పఠనం వలన కలిగే లాభాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను చదివించారు. సర్దార్ వల్లభాయిపటేల్ జీవిత చరిత్రను గ్రంథాలయాధికారి చదివి వినిపించారు. విద్యార్థులకు క్యారమ్స్, చదరంగం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, తెలుగు ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యావతి, రాము, రమేష్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వత్సవాయి : స్థానిక గ్రేడ్-3 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. శిక్షణా శిబిరానికి వస్తున్న విద్యార్థులకు పలు పోటీలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఐదోరోజున లెమన్ స్పూన్ ఆటను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతు అందించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వేసవి శిక్షణా శిబిరానికి విద్యార్థులు ఉత్సాహంగా వస్తున్నారని గ్రంథాలయాధికారి ఎ.ప్రభాకరరావు తెలిపారు.

కంచికచర్ల : వేసవి విరామాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. ప్రముక రచయిత సర్వేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్, జల్లి కారల్‌మార్క్స్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల జాబితా విడుదల

54 గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు

నందిగామ టౌన్: రైతులు అధైర్య పడొద్దని, ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల జాబితాను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, ధాన్యంను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన సాగుతుందని గత ప్రభుత్వాల మాదిరిగా రైతులను గాలికొదిలేయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నారని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంతే కాకుండా నియోజకవర్గ పరిధిలోని 54 గ్రామాలలో సహకార సంఘాల ద్వారా రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని తెలిపారు. పంటలను కృష్ణా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెట్ సొసైటీల ద్వారా రెండు మూడు రోజులలో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు న్యాయం చేస్తాం



పెనుగంచిప్రోలు: అగ్ని ప్రమాద బాధితులకు పూర్తి న్యాయం చేస్తానని తిరుపతమ్మ అమ్మవారి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రమేష్ నాయుడు పేర్కొన్నారు. గ్రామంలోని తిరుపతమ్మ అమ్మవారి ఆలయం పరిసరాలను ఆయన శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకుని నష్టపోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. వారికి నష్టపరిహారంతో పాటు ఒక ఏడాది పాటు అద్దె చెల్లించకుండా ఉండేలా నూతన దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆడిటోరియం అభివృద్ధి పనులు, డార్మెటరీ కేశఖండన శాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని దేవదాయ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. రాష్ట్రంలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సిబ్బంది కూడా తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. లేకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజు, కాంట్రాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

నందిగామ టౌన్: ఉద్యోగులు ప్రభుత్వంలో అంతర్భాగమని ఉద్యోగుల డిమాండ్‌లు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయటంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఉద్యోగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఉద్యోగుల డిమాండ్, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై ఆషానాయుడు కళాబృందంలోని పలువురు నృత్యకారులు ప్రతిభను ప్రదర్శించారు.

నర్సుల సేవలు ప్రశంసనీయం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ శౌరిబాల

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోగులకు వైద్య సేవలు అందిస్తున్న నర్సుల పని తీరు ప్రశంసనీయమని చిట్టినగర్ లంబాడీపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భావన అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం 47వ డివిజన్‌లోని 147వ వార్డ్ సచివాలయం హెల్త్ సెక్రటరీలు స్పందన, సుధా, పరిమళలను ఆమె సత్కరించారు. సచివాలయ కన్వీనర్లు దేరంగుల వెంకట రమణ, ఇలిపిళ్ల విజయలక్ష్మి, మద్దిరాల కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ భావన మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవాస్ఫూర్తితో రోగులకు నిస్వార్థంగా సేవలు అందించేది నర్సులేనన్నారు. ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకట రమణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు భరోసా ఇచ్చాయన్నారు. కన్వీనర్ మద్దిరాల కమలాకర్ మాట్లాడుతూ రోగులకు వైద్యులు ఇచ్చే మందులు ఎంత ముఖ్యమో నర్సులు చేసే వైద్య సేవలు అంతే ముఖ్యమన్నారు.

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే హాస్పటల్, అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యాన రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు.

ముఖ్యఅతిథి రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల, అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ కన్సల్టెంట్ డాక్టర్ అనిలా పాటిబండ్లతో కలసి ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులర్పించి కేక్ కోశారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జయ్‌దీప్, డాక్టర్ వి.సునీల్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సులు.. మాతృమూర్తులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైద్యరంగంలో నిస్వార్థమైన సేవలు అందిస్తున్న నర్సులే నిజమైన మాతృమూర్తులని ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ హాల్లో నర్సులను సన్మానించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నర్సులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. అటువంటి నిస్వార్థసేవలు అందిస్తున్న నర్సులను సత్కరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని నర్సులు తమ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. అనంతరం దంత వైద్యశాలకు చెందిన కె. శివలీల, వి.రాణి, పాత ప్రభుత్వాస్పత్రికి చెందిన కె. ఇందిరాదేవి, బి.విజయశ్రీ, సీహెచ్ కల్యాణి, టి.తబిత, ఝున్సీ రాణి, నూతన జనరల్ ఆస్పత్రికి చెందిన ఎస్.కె. షమావల్లాబేగం, డి. కనకదుర్గలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి సతీష్ కుమార్, సహాధ్యక్షులు బీవీ రమణ, ఉపాధ్యక్షులు ఎం.రాజబాబు, నగరశాఖ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా గ్రామాలు

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- పెద్దాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



పెద్దాపురంలో లబ్ధిదారునికి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెద్దాపురం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. లబ్ధిదారులు పొందిన పథకాల వివరాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు మహిళలను విస్మరిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం మహిళల సంక్షేమం, రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల మంచి కోరే ప్రభుత్వమని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకంపై సామాజిక తనిఖీ



అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న ఏవో వరలక్ష్మి

బలుసుపాడు(జగ్గయ్యపేట): రైతు భరోసా పథకం 2023-24 ఏడాదికి మొదటి విడత నిధులను ప్రభుత్వం ఈ నెలాఖరుకు విడుదల చేయనుందని వ్యవసాయాధికారి వరలక్ష్మి పేర్కొన్నారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం అర్హుల జాబితాపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో అర్హుల జాబితా ఈ నెల 12 నుంచి 15 వరకు సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. జాబితాలో పేరు లేకుంటే రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 15 నుంచి 18 వరకు నమోదు చేయించుకోవాలని తెలిపారు. కొత్తగా పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులు కూడా నమోదు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ సూరిబాబు, వీఏఏ సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు

మండల సమావేశంలో ఎంపీపీ మలక్‌బషీర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్ బషీర్

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మలక్ బషీర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ నుంచి రూ.1.5 కోట్ల నిధులతో అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం, బోరు పంపులు వేయించామన్నారు. జిల్లా పరిషత్ నుంచి ఇప్పటికే మండలంలోని కొన్ని గ్రామాలకు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిప్రియ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు నిత్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తహసీల్దార్ శంకరబాబు మాట్లాడుతూ రేషన్ కార్డు అవసరమైన వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కంచికచర్ల పీహెచ్‌సీ డాక్టర్ కే మధురిమ మాట్లాడుతూ బీపీ, సుగర్, రక్త పరీక్ష, కిడ్నీల పరీక్షలు కావల్సిన వారు ఉచితంగా ఆసుపత్రిలో చేయించుకోవాలని సూచించారు. విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణారావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు పనులు ప్రారంభించామని అన్నారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ బండి మల్లిఖార్జునరావు, ఎంఈఓ చిట్టిబాబు, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ కే బాలశంకరరావు, ఏపీఎం కోట భాస్కరరావు, హౌసింగ్ ఏఈ ఏ నరసింహారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరం

పటమట(విజయవాడపశ్చిమ): మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఏపీ, తెలంగాణ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో 51వ డివిజన్‌లోని పల్లా కనకయ్య కమ్యూనిటీ హాల్లో శుక్రవారం సచివాలయం సిబ్బంది ఇతర కమ్యూనిటీ సిబ్బందికి మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలు పెద్ద సంఖ్యలో అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. వారితో లైంగిక వ్యాపారానికి తెగబడుతున్నారన్నారు. వేలాది మంది తల్లిదండ్రులకు దూరమవుతున్నారని, దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని వివరించారు. నూతన సాంకేతిక మాధ్యమాలు అక్రమ రవాణాకు ఊతమిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజ్వల సంస్థ వివిధ ప్రభుత్వ సంస్థల సాయంతో వేలాది మందిని అక్రమ రవాణా నుంచి కాపాడిందని చెప్పారు. మానవఅక్రమ రవాణాపై లఘుచిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. సీనియర్ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రావ్య, వినోద్‌కుమార్ పోలీసు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు పేట నియోజకవర్గ వ్యాప్తంగా ఆగిపోయిన అభివృద్ధి పనులను వెంటనే అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈఎస్ఐ హాస్పిటల్‌కు రూ.5 కోట్లు, ట్రామాకేర్ సెంటర్‌కు రూ.3 కోట్లు ప్రకటించినప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని, నియోజకవర్గ రైతులకు సాగునీటి వసతికై గతంలో కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఎత్తిపోతల పథకాన్ని ప్రస్తుతం వేదాద్రి గ్రామానికి మార్చి శంకుస్థాపన చేసినప్పటికీ సక్రమంగా నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఆగిపోయాయని, ఇలా పలు సమస్యలను వినతిపత్రం ప్రస్తావించారు. బీజేపీ పేట అసెంబ్లీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొడాలి అపర్ణ, జిల్లా ఇంటిలెక్చువల్ సెల్ కన్వీనర్ కె.మల్లిఖార్జునరావు, పేట పట్టణ అధ్యక్షుడు పచ్చిపాల నాగేశ్వరరావు, పేట రూరల్ అధ్యక్షుడు చేపూరి వెంకటాచారి, వత్సవాయి మండల అధ్యక్షుడు కాకాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్ సస్పెన్షన్

జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో విద్యుత్ శాఖ లైన్‌మెన్ శ్రీహరిని సస్పెండ్ చేస్తూ విజయవాడ డీఈఈ శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారని ఏఈ తారాచంద్ తెలిపారు. ఈ నెల 11న గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్ట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న తేజావత్ నాగేశ్వరరావును విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేసేందుకు అనుమతించిన శ్రీహరిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో నాగేశ్వరరావు అనే వ్యక్తి మృతిపై తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.